సాక్షి
పెద్దపల్లి

బుధవారం । 26 । జూలై । 2023



కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాలకు రాజ్యాధికారం

బలహీనవర్గాలకు రాజ్యాధికారంకాంగ్రెస్ తోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు.

8లో▸



పార్వతీ బ్యారేజీ 40 గేట్లు ఎత్తివేత

మంథని: పార్వతీ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీలోకి 68,848 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అంతేస్థాయిలో దిగువకు వదులుతున్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా పాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల్లో ముందుండాలి



ప్రకృతి వనం పరిశీలిస్తున్న ప్రియాంక

సుల్తానాబాద్ రూరల్: అభివృద్ధి పనుల్లో అధికారులు ముందుండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రియాంక సూచించారు. మండలంలోని గొల్లపల్లి, నారాయణరావుపల్లి గ్రామాలను మంగళవారం సందర్శించారు. కార్యదర్శుల పనితీరు, పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు, పాఠశాలలను పరిశీలించారు. గ్రామాల అభివృద్ధికి ఎప్పటికప్పుడు ప్రణాళిక రూపొందించుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు బండారి రమేశ్, వెంకటలక్ష్మీ, డీపీఓ చంద్రమౌళి, డీఎఫ్‌వో శివయ్య, ఎంపీడీఓ శశికళ, కార్యదర్శి ప్రమోద్, ఏపీడీ సత్యనారాయణ, ఏపీఓ లావణ్య, ఏపీఎం గీత ఉన్నారు.

క్వార్టర్లకు మురికినీటి సరఫరా



కలుషిత నీరు సరఫరా అవుతున్న దృశ్యం

రామగుండం: జెన్‌కో ఉద్యోగుల క్వార్టర్లకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటున్నారు ఉద్యోగులు. తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.28లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఓదెల: ఓదెల మల్లన్నస్వామికి హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మంగళవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. రూ.28,03,274 వచ్చినట్లు ఆలయ ఈవో సదయ్య తెలిపారు. లెక్కింపులో పాలకవర్గ సభ్యుడు బత్తుల రమేశ్, దేవదాయశాఖ పెద్దపల్లి ఇన్‌స్పెక్టర్ సుజాతరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, శ్రీరాజరాజేశ్వర స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బూత్ లెవెల్ ఆఫీసర్ల శిక్షణ

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గ ఫొటో ఎలక్టోరల్ రోల్స్ రెండో స్పెషల్ సర్వే రివిజన్ బూత్ లెవల్ ఆఫీసర్ల ఐదు రోజుల శిక్షణ ముగిసింది. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్ మిలీనియం హాలులో జరుగుతున్న ముగింపు కార్యక్రమంలో రామగుండం తహసీల్దార్ జావేద్ పాషా మాట్లాడారు. నియోజకవర్గానికి సంబంధించిన 233 మంది బూత్ లెవల్ అధికారులు, 25 మంది సూపర్‌వైజర్లకు రోజుకు 50 మంది చొప్పున శిక్షణ ఇచ్చామన్నారు. మాస్టర్ రిసోర్స్ పర్సన్స్ గద్దె శ్రీనివాస్, అంజన్ కుమార్, సంతోష్ కుమార్, శ్రీధర్, నాగరాజు, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేసేటప్పుడు సంబంధిత ధ్రువీకరణపత్రాలు తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. శిక్షణలో బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

సులువుగా అర్థమయ్యేలా బోధన సాగాలి

- స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ప్రియాంక
- జిల్లా స్థాయి తొలిమెట్టు శిక్షణాతరగతులు

పెద్దపల్లిరూరల్: విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన సాగాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ప్రియాంక ఉపాధ్యాయులకు సూచించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎస్ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకుని విద్యార్థులకు మంచి వాతావరణంలో నాణ్యమైన విద్యా బోధన అందించాలన్నారు. ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. నూతన విద్యా బోధనలకు అనుగుణంగా విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించేలా శ్రద్ధ చూపాలన్నారు. డీఈవో మాధవి, ఉపాధ్యాయులున్నారు.

ఏకమైన ఏరు..!

- పోటెత్తిన వాగులు, వంకలు
- జ్యోతినగర్ వద్ద తెగిన బూడిద కరకట్ట
- నీట మునిగిన పేదల ఇళ్లు
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే చందర్
- బాధితులను పరామర్శించిన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- మళ్లీ మునిగిన మంత్రపురి
- మాతాశిశు ఆస్పత్రి చుట్టూ చేరిన వరద

> జిల్లాలో మంగళవారం జడివాన కురిసింది. వరదనీటితో ఏరులన్నీ ఏకమయ్యాయి. చెరువులు, కుంటలు నిండాయి. గోదావరి, మానేరులో వరద ప్రవాహం పెరిగింది. హుస్సేనిమియా వాగు ఉప్పొంగింది. లోలెవల్ వంతెనలు నీటమునిగి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లావ్యాప్తంగా 41 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

సాక్షి, పెద్దపల్లి: జోరు వర్షానికి పలు గ్రామాల్లో పత్తి చేనుల్లోకి వరద నీరు చేరింది. హుస్సేనిమియా వాగు ఉప్పొంగి ప్రవహించటంతో కాల్వశ్రీరాంపూర్, పరీవాహక ప్రాంతాల్లోని చేలన్నీ నీట మునిగాయి. జిల్లాలో 1067 చెరువులకుగాను 732 చెరువులు మత్తడి పోస్తున్నాయి. బలహీనంగా ఉన్న చెరువు కట్టలకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

రామగుండంలోని బీథర్మల్ పవర్ ప్రాజెక్టు కరకట్ట తెగిపోవడంతో ఆటోనగర్, పరిసర కాలనీల్లోకి బూడిద, వరదనీరు చేరి సుమారు 150 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మంథనిలో పద్మశాలీ వీధి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, గంగాపూర్‌లో ఇళ్లలోకి వరదనీరు చేరింది. ఓదెలలో రైల్వే అండర్‌బ్రిడ్జిలు జలమయమయ్యాయి.

ఎల్లంపల్లికి పెరుగుతున్న వరదనీరు

మహారాష్ట్రతోపాటు ఎగువ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టులో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో 59,504 క్యూసెక్కులు ఉండగా 8 గేట్లు అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు.



ఇళ్లలోకి చేరిన వరద నీరు



ఇళ్లలోకి చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నీటిని తోడేస్తున్న బాలుడు

నీటితో నిండిన రైల్వే అండర్‌బ్రిడ్జిలు



ఉప్పరపల్లె రైల్వేఅండర్‌బ్రిడ్జి

ఓదెల: కాజీపేట్– బల్లార్షా సెక్షన్ల మధ్య ఉప్పరపల్లె లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద రైల్వే అండర్‌బ్రిడ్జి పూర్తిగా నిండిపోయింది. నీరు రైలుపట్టాలపైకి చేరడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సిర్‌పూర్‌కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే భాగ్యనగర్, గూడ్సు, ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ ఎక్కడికక్కడే ఆగిపోయాయి. భాగ్యనగర్ గంటసేపు ఆగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రైల్వేసిబ్బంది హుటాహుటిన చేరుకుని మరమ్మతు చేపట్టారు. అండర్‌బ్రిడ్జిలు నిండటంతో ఉప్పరపల్లె, హరిపురం గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. నాంసానిపల్లె, కొలనూర్, గోపరపల్లె చెరువుల మత్తళ్లు దూకుతున్నాయి.

తెగిన బూడిద కరకట్ట

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ సమీపంలోని బూడిద చెరువు కరకట్ట తెగిపోయింది. ఎనిమిది మీటర్ల మేర కట్ట తెగిపోవడంతో బూడిద చెరువులోని నీరంతా రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ ఆటోనగర్, సుభాష్‌నగర్, మొమిన్‌నగర్‌ను ముంచెత్తింది. సుమారు 150 ఇళ్లలో మోకాలు లోతుకు నీరు వచ్చింది. ఉదయం కావడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. వరద నీటితో బియ్యం, ఇతర వస్తువులు పనికిరాకుండా మారాయి. బురదతోపాటు బూడిద ఇల్లంతా చేరింది.

పేదలను ఆదుకుంటాం: ఎమ్మెల్యే కోరుకంటి

బూడిద చెరువు కట్ట తెగి నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. అండగా ఉంటామని బాధితులకు ధైర్యం చెప్పారు. బూడిద కట్ట తెగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కో కుటుంబానికి పది కిలోల బియ్యం చొప్పున అందిస్తామన్నారు. సర్వే చేసి అర్హులకు గృహలక్ష్మీ పథకంలో రూ.3 లక్షలు ఇప్పించేందుకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు.

ముందస్తు చర్యలకు కలెక్టర్ ఆదేశం

బూడిద చెరువు కరకట్ట తెగిపోయిన విషయం తెలుసుకున్న కలెక్టర్ ముందస్తు చర్యలకు ఆదేశించారు. మరో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వరద నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణ చర్యలకు తనను నేరుగా ఫోన్‌లో సంప్రదించాలని అధికారులకు తెలిపారు.

ముంపు బాధితులకు మక్కాన్‌సింగ్ భరోసా

మోమీన్‌నగర్‌లో ముంపునకు గురైన నిర్వాసితులకు రూ.లక్ష చొప్పున అందించాలని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వరద ముంపు ప్రాంతంలో పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు. ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసరాలు, వస్తువులు తడిచిముద్దయ్యాయని, పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు ఉన్నారు. అనంతరం పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. నష్టపోయిన కుటుంబాలకు అధికారులు న్యాయం చేయాలన్నారు. రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్, ఏసీపీ తుల శ్రీనివాసరావు, రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎస్సై బి.జీవన్ తదితరులు కరకట్ట తెగిన ప్రాంతంలో జేసీబీతో మట్టిని అడ్డుగా పోయించారు.



ఆటోనగర్‌లో పర్యటిస్తున్న మక్కాన్‌సింగ్

వర్షపాతం వివరాలు (మి.మీ)

ధర్మారం	37.9	జూలపల్లి	55.2
పాలకుర్తి	35.2	ఎలిగేడు	46.0
అంతర్గం	29.9	సుల్తానాబాద్	64.1
రామగుండం	49.2	ముత్తారం	147.4
రామగిరి	66.5	శ్రీరాంపూర్	106.7
కమాన్‌పూర్	72.0	మంథని	104.7
పెద్దపల్లి	41.8	సరాసరి	67.8

మంత్రపురి జలమయం



మంథని పద్మశాలీ వీధిలో ఇళ్లలోకి వరద

మంథని: రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి మంత్రపురి జలమయమైంది. లోతట్టు ప్రాంతాలైన పద్మశాలీ వీధి, గంగాపురి, పాత బస్టాండ్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణ నీటితో నిండిపోయాయి. మురుగు కాల్వలు పొంగి ఇళ్లలోకి ప్రవహించాయి. కాకర్లపల్లి ప్రధాన రహదారిపై మోకాళ్లోతు నీరు చేరింది. మంథని–ముత్తారం గ్రామాల రాకపోకలకు అసౌకర్యం కల్గింది. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి ఆర్అండ్ఆర్ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న లోలెవల్ కల్వర్టుపై నుంచి పెద్ద ఎత్తున వరద వెళ్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బొక్కలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

మాతా శిశు ఆస్పత్రి చుట్టూ చేరిన నీరు

మంథనిలోని మాతాశిశు ఆస్పత్రి చుట్టూ నీరు చేరింది. రెడ్డి చెరువుకు మత్తడి పడడంతో పంట పొలాల మీదుగా వరద ఆస్పత్రి చుట్టూ చేరుతోంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ పరిస్థితిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉన్నారు. అవసరమైన రోగులను తరలించేందుకు ఏర్పాటు చేసుకున్నారు. గోదావరి, మానేరు నదులు సాధారణ స్థితిలోనే ప్రవహిస్తున్నాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న బొక్కలవాగు

ఏఎల్‌పీ గనిలో ప్రమాదం.. కార్మికుడి మృతి

కమాన్‌పూర్ (మంథని): జిల్లాలోని ఆర్జీ–3 పరిధి ఏఎల్‌పీ గనిలో మంగళవారం రెండో షిఫ్టులో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎంజేడబ్ల్యూ కార్మికుడు సారయ్య (40) అక్కడికక్కడే మృతి చెందాడు. మల్టీజాబ్‌వర్కర్‌గా పని చేస్తున్న సారయ్య గనిలోని ఎల్‌సీ 31 లెవల్‌లో డ్రిల్ పనులు చేస్తుండగా ఓస్ పైపు ఊడిపోయింది. అది సారయ్య ఛాతికి బలంగా తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అధికారులు, తోటి కార్మికులు ప్రయత్నించారు. ఏఎల్‌పీ గనికి వెళ్లే దారిలో ఉన్న బొక్కలవాగుపై ఉన్న స్టీల్ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో అంబులెన్స్ గని వద్దకు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో సారయ్యను సుమారు కిలోమీటర్ వరకు తీసుకొని వచ్చి అక్కడి నుంచి అంబులెన్స్‌లో గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడిది ముత్తారం మండలం శుక్రవారంపేట. సెంటనరీకాలనీలో నివాసం ఉంటున్నాడు. సారయ్యకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహం గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో ఉంది.

అంబులెన్స్ వచ్చిఉంటే...



ఆసుపత్రి వద్ద కార్మికులు, సింగరేణి అధికారులు



సొమ్మసిల్లి పడిపోయిన సారయ్య భార్య జ్యోతి

గోదావరిఖని: అడ్రియాల్ లాంగ్‌వాల్ ప్రాజెక్టులో తీవ్రంగా గాయపడిన కార్మికుడు సారయ్యను సకాలంలో ఆసుపత్రికి తరలిస్తే బతికేటోడని తోటి కార్మికులు అంటున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సారయ్యను గనిపైకి తీసుకొచ్చినప్పటికీ అంబులెన్స్‌కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలతో అడ్రియాల గనికి వెళ్లే ప్రధాన దారిలో ఉన్న కాజ్‌వేపై నీరు భారీగా ప్రవహిస్తుండటంతో అంబులెన్స్‌ను ఇవతలి వైపునే నిలపాల్సి వచ్చింది. దీంతో గాయపడిన కార్మికుడిని క్యాంపర్ (జీపు) వాహనంలో తీసుకొచ్చి అంబులెన్స్‌లో ఎక్కించాల్సి వచ్చింది. కార్మికుడికి సకాలంలో వైద్యం అందించలేని పరిస్థితిపై కార్మిక నాయకులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సారయ్య మృతదేహం



సారయ్య(ఫైల్)

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ధర్మారం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీవో శ్రీధర్ సూచించారు. మండలంలోని నందిమేడారం, చామనపల్లిలో ఎంపీడీవో భీమ జయశీలతో కలిసి మండలస్థాయి అధికారులు పర్యటించారు. నందిమేడారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశీలించారు. శ్రీధర్, జయశీల మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కుండలు, ఇతర పాత్రల్లోని నీటిని పారబోయాలని సూచించారు. సర్పంచులు సామంతుల జానకీ, తిరుపతి, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు ఎండీ.సలామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వంట సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

పీఆర్సీ ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ ఏర్పాటు చేయాలని తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామరపల్లి జయపాల్ రెడ్డి కోరారు. తహసీల్దార్ యాకన్నకు మంగళవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఐఆర్ ప్రకటించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ వర్తించేలా చూడాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు పర్చాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, పదోన్నతులు చేపట్టాలని కోరారు. మండల బాధ్యులు ఏ.వెంకటేశ్వర్లు ఉమాశంకర్, రమేశ్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జయపాల్ రెడ్డి

జీజీహెచ్ అభివృద్ధికి చర్యలు

- గోదావరిఖని ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్
- మెరుగైన వైద్యసేవలకు ఆదేశం

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి, నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. జీజీహెచ్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. అన్ని బ్లాకులు, వార్డులను పరిశీలించారు. వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. భోజనం, శానిటేషన్‌పై ఆరా తీశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. ప్రతి బెడ్ వద్ద రోగుల సహాయకుల కోసం 330కుర్చీలను అందిస్తామని తెలిపారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని డాక్టర్లను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవలపై సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరత ఉందని, అయినా సేవల్లో అంతరాయం లేకుండా చూస్తున్నామని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ తెలిపారు. మెడికల్ బయో వేస్టేజీ సేకరించే సంస్థ ఆశించిన స్థాయిలో సేవలందించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మరో సంస్థతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆగిపోయిన బయోమెడికల్ రూం నిర్మాణం చేపట్టాలని టీఎస్ఎంఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. నూతన బ్లాక్‌కు ఆక్సిజన్ అందించేందుకు, ఆర్ఓ ప్లాంట్‌కు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్ సింగ్, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్త బ్లాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

బురద దారిలో నడక.. ఇబ్బంది పడిన కలెక్టర్

ఆస్పత్రి ప్రాంగణంలో బురదమయంగా మారిన దారుల్లో నడవటానికి కలెక్టర్, ఆస్పత్రి అధికారులు ఇబ్బంది పడ్డారు. 85 పడకల కొత్త బ్లాక్‌ను పరిశీలించడానికి వెళ్తుండగా.. బురద ఉండడంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి రెండు రోజుల్లో సమర్పించాలని టీఎస్ఎంఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు.

జీజీహెచ్‌లో మొరాయించిన లిఫ్ట్

ఆస్పత్రిలోని లిఫ్ట్ మొరాయించింది. వార్డులను సందర్శించేందుకు కలెక్టర్ లిఫ్ట్ ఉపయోగించడానికి సిబ్బంది ప్రయత్నం చేసినా సాంకేతిక సమస్యతో పని చేయలేదు. సెన్సార్ కారణంగా తరచూ లిఫ్ట్ పని చేయడం లేదని హిమబిందు సింగ్ తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ సందర్శన

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఎరువుల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. మెయిన్ కంట్రోల్ యూనిట్, ఎరువుల లోడింగ్ యూనిట్‌ను పరిశీలించారు.

వరద ఉధృతిని పరిశీలించిన జెడ్పీ సీఈఓ

మంథని: మంథని మండలం సూరయ్యపల్లిలో వరద ఉధృతిని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. గతేడాది వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో సీఈఓ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సర్పంచ్ బీముని పుష్ప, ఎంపీడీఓ రమేష్, కార్యదర్శి మౌనిక ఉన్నారు.



అడిషనల్ కలెక్టర్‌గా అరుణశ్రీ

- వారం రోజులకే ప్రియాంక బదిలీ

పెద్దపల్లిరూరల్: జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా జాల్ద అరుణశ్రీ నియమితులయ్యారు. ఇక్కడ అడిషనల్ కలెక్టర్‌గా వారం క్రితమే బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక బదిలీ అయ్యారు. ఆమెను సూర్యాపేట అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లా స్థానికసంస్థల అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అరుణశ్రీ బదిలీపై ఇక్కడకు రానున్నారు. ప్రియాంక కేవలం వారం రోజుల వ్యవధిలోనే బదిలీ కావడం చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

'గాయత్రి'లో బెస్ట్ ఫ్రం వేస్ట్ ఎగ్జిబిషన్



వస్తువులను పరిశీలిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ రజని

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం బెస్ట్ ఫ్రం వేస్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎనిమిదో, తొమ్మిదో తరగతుల విద్యార్థులు సాంఘిక శాస్త్ర ప్రాజెక్టులో భాగంగా పనికిరాని ప్లాస్టిక్ బాటిల్స్, అట్టముక్కలతో తయారు చేసిన పలు వస్తువులను ప్రదర్శించారు. విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని స్టాళ్లను పరిశీలించి, విద్యార్థులను అభినందించారు. పనికిరాని వస్తువులతో తయారైన పెన్ స్టాండ్స్, ఫ్లవర్ వాజ్‌లు, పేపర్ బ్యాగ్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, పీఈటీ నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాయ్ రాష్ట్ర చైర్మన్‌గా మొండయ్య



నియామక పత్రం అందిస్తున్న శ్రీనివాస్

గోదావరిఖనిటౌన్: తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించారు. కాయ్ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా గోదావరిఖనికి చెందిన కొయ్యడ మొండయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి సాయికుమార్‌లకు మొండయ్య కృతజ్ఞతలు తెలిపారు.

అదనంగా చెల్లిస్తామంటూ రూ.2.81 లక్షలకు టోకరా

- సైబర్ క్రైం కేసు నమోదు

జ్యోతినగర్: పెట్టుబడికి 30 శాతం అదనంగా చెల్లిస్తానని చెప్పడంతో ఓ వ్యక్తి పెట్టుబడి పెట్టి, మోసపోయిన ఘటనపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖాజిపల్లికి చెందిన హర్షవర్ధన్ ఈ నెల 2న టెలిగ్రాంలో వచ్చిన సంక్షిప్త సమాచారంతో సంబంధిత వ్యక్తికి కాల్ చేశాడు. అతను పెట్టుబడి పెట్టిన సొమ్ముకు అదనంగా 30 శాతం చెల్లిస్తామని చెప్పడంతో రూ.2,81,000 ఇన్వెస్ట్ చేశాడు. రోజులు గడిచినా అధిక మొత్తం రాకపోవడంతో సంబంధిత వ్యక్తితో మాట్లాడగా మరో రూ.7 లక్షలు పెట్టుబడి పెడితే మొత్తం కలిపి ఇస్తామన్నాడు. దీంతో హర్షవర్ధన్ తాను మోసపోయానని గ్రహించి, మంగళవారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సైబర్ క్రైం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ తెలిపారు. అపరిచిత వ్యక్తుల సమాచారంతో డబ్బులను పంపించొద్దని, బ్యాంక్, ఏటీఎం, ఆధార్ కార్డు వివరాలను చెప్పొద్దని సూచించారు.

మంథని డివిజన్‌లో 396.8 మిల్లీమీటర్ల వర్షం

మంథని: మంథని డివిజన్‌లోని ఆయా మండలాల్లో మంగళవారం 396.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డివిజన్‌లో అత్యధికంగా ముత్తారం మండలంలో 148.2 మి.మీ, మంథనిలో 104.2, కమాన్‌పూర్‌లో 76.2, రామగిరిలో 68.2 మి.మీగా నమోదైంది. డివిజన్ సరాసరి వర్షపాతం 99.2మి.మీగా రికార్డయ్యింది.

గాయాలు కాలేదని చెప్పి.. అనంతలోకాలకు

- బొలెరో వాహనం, కారు ఎదురెదురుగా ఢీ
- బంధువులతో ఫోన్‌లో మాట్లాడిన అరగంటకే మృతి
- మృతుడు ధర్మపురి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు
- బంజేరుపల్లి తండా బి వద్ద ఘటన



ప్రమాదం తర్వాత ఫోన్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ



సత్యనారాయణ (ఫైల్)

ధర్మారం/ధర్మపురి: రోడ్డు ప్రమాదానికి గురైన కారులో నుంచి దిగాడు.. తనకు ఎలాంటి గాయాలు కాలేదని బంధువులకు ఫోన్‌లో తెలిపాడు.. ఆ తర్వాత అరగంటకే అనంతలోకాలకు వెళ్లిపోయాడు ధర్మపురికి చెందిన న్యాయవాది బండారి సత్యనారాయణ(49). ప్రత్యక్ష సాక్షులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. సత్యనారాయణ గతంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. మంగళవారం జగిత్యాల కోర్టులో పని ముగించుకొని, తన సొంత పనులపై కారులో కరీంనగర్ వెళ్లారు. అక్కడి నుంచి ధర్మపురి వస్తుండగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండా బి గ్రామం వద్ద ఆయన కారు, మేకల లోడ్‌తో ఆర్నకొండ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరో రోడ్డు కింద బోల్తా పడింది. ఆ వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో సత్యనారాయణ ఒంటిపై ఎలాంటి గాయాలు కాలేదు. ఆయన బయటకు వచ్చి, వెంటనే తన బంధువులకు ఫోన్‌లో జరిగిన విషయం చెప్పారు. తనకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు.

గతంలో గుండెకు స్టంట్లు..

అప్పటికే స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనం సంఘటన స్థలానికి చేరుకుంది. వాహనంలోకి ఎక్కిస్తుండగానే సత్యనారాయణ ప్యాంట్‌లో మూత్ర విసర్జన చేసినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన గుండెకు కొన్ని నెలల క్రితం స్టంట్లు పడినట్లు బంధువులు పేర్కొన్నారు. మృతుడికి భార్య శోభ, ఇంటర్ చదివే కుమారుడు, ఐదో తరగతి చదివే కూతురు ఉన్నారు. సత్యనారాయణ చనిపోయిన వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం వేగంగా వచ్చి, ఢీకొట్టడం వల్లే సత్యనారాయణ చనిపోయాడని మృతుడి బాబాయి కుమారుడు రాజమహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొలెరో డ్రైవర్, ఆర్నకొండకు చెందిన సంతోష్ రెడ్డిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.

మత్స్యకారులకు పరిహారం చెల్లించాలి

- సుందిళ్ల బక్క చెరువులో చేపల మృతిపై విచారణ జరపండి
- ఆర్జీ–1 జీఎంకు వినతి





బక్క చెరువులో చనిపోయిన చేపలు, జీఎంకు వినతిపత్రం ఇస్తున్న చైర్మన్ రాజలింగు, మత్స్యకారులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత రామగిరి మండలంలోని సుందిళ్ల గ్రామ బక్క చెరువులో కలుషిత నీరు చేరడం వల్ల చేపలు చనిపోయాయని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు అన్నారు. మత్స్యకారులకు పరిహారం చెల్లించి, ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు సుందిళ్ల మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులతో కలిసి మంగళవారం ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఓసీపీ–5లో జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో వచ్చే యాష్ రసాయనాలు, బొగ్గు కుప్పల నుంచి వచ్చే కలుషితమైన వరద నీరు చెరువులో చేరి, చేపలు చనిపోయినట్లు పేర్కొన్నారు. కేజీ నుంచి రెండు కేజీల చేపలతోపాటు పిల్లలు దాదాపు 40 టన్నుల వరకు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి విలువ రూ.40 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. విచారణ జరిపి, మత్స్యకారులకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు నారాయణ, సభ్యులు సుంకరి రవి, విజయ్, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాలకు రాజ్యాధికారం

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు



మాట్లాడుతున్న వి.హన్మంతరావు

కరీంనగర్‌టౌన్: బలహీనవర్గాలకు రాజ్యాధికారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ ఐక్య వేదిక సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా వి.హనుమంతరావు, మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనమండలి సభ్యుడు జీవన్ రెడ్డి హాజరయ్యారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగిందని, ఇలాంటి ముఖ్యమంత్రిని నేను ఎన్నడు చూడలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీసీల గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలోనే న్యాయం జరిగిందని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మల్లిఖార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని అన్నారు. తాను రెడ్డి సామాజికవర్గానికి చెందిన వాడినైతే ఎప్పుడో ముఖ్యమంత్రి అయ్యేవాడినని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ 60శాతం ఉన్న బలహీనవర్గాల వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు చెందిన వారిని పీసీసీ అధ్యక్షులుగా ఎంతో మందికి అవకాశం కల్పించిందని ఇది వేరే పార్టీల వల్ల అవుతుందా అని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్‌సింగ్, ఈర్ల కొమురయ్య, వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నం దూరం...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీలో చోటు కల్పించకపోవడంపై అలకబూనిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ బీసీ ఐక్య వేదిక సమావేశానికి హాజరు కాలేదు. పొన్నం అనుచరులు సైతం హాజరుకాకపోవడంతో సభ వెలవెలపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ నేతృత్వంలో బీసీ నేతలు చొరవ తీసుకొని ఉదయం నుంచే ఉమ్మడి జిల్లాలోని నాయకులందరికీ ఫోన్లు చేసి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేశారు.

వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం



ఓసీపీ-2 ప్రాజెక్టు

కమాన్‌పూర్: ఆర్జీ–3 డివిజన్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉపరితల గని ఓసీపీ–2లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ(మట్టి) తొలగింపునకు ఆటంకం కలుగుతోంది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు 8,048 టన్నుల బొగ్గు ఉత్పత్తి, 1.23 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు చేపట్టారు. 12,235 టన్నుల బొగ్గు రవాణా జరిగినట్లు అధికారులు తెలిపారు.

సీఎంపీఎఫ్ చిట్టీలు ఇప్పించండి



యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన సీఎంపీఎఫ్ చిట్టీలను ఇప్పించి, సర్క్యులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి మంగళవారం ఆర్జీ–2 ఎస్వోటూ జీఎం సలీంకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికుల నెల జీతంలో రికవరీ అవుతున్న డబ్బులు విషయంలో గందరగోళం నెలకొందని అన్నారు. నాయకులు రాజనర్సు, గట్టయ్య, రమేశ్, లింగయ్య, సదానందం నారాయణ పాల్గొన్నారు.

సింగరేణిలో ముగ్గురు జీఎంల బదిలీ

గోదావరిఖని: సింగరేణి సంస్థలో ముగ్గురు జీఎంలను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్ ఎస్టేట్ జీఎం డి.రవిప్రసాద్‌ను బెల్లంపల్లి జనరల్ మేనేజర్‌గా, నైని బ్లాక్ జీఎం ఎం.సురేష్‌ను కార్పొరేట్ ఎస్టేట్ జీఎంగా, బెల్లంపల్లి జీఎం గాజర్ల రవీందర్‌ను మార్కెటింగ్ జీఎంగా హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

తొమ్మిది మంది ఈఅండ్‌ఎం అధికారులు

తొమ్మిది మంది ఈఅండ్‌ఎం అధికారులు బదిలీ అయ్యారు. ఎస్టీపీపీ జీఎం డీవీఎస్ సూర్యనారాయణరాజును కార్పొరేట్ ఓసీపీల జీఎంగా, కార్పొరేట్ ట్రాన్స్‌పోర్ట్ జీఎం ఎన్.దామోదర్‌రావును కార్పొరేట్ సీడబ్ల్యూఎస్ జీఎంగా, స్టోర్స్ జీఎం చిన్న బసవిరెడ్డిని ఎస్టీపీపీ జీఎంగా, అండర్ గ్రౌండ్ మైన్స్ జీఎం ఎస్.జగన్మోహన్‌రావును ట్రాన్స్‌పోర్ట్ జీఎంగా, స్టోర్స్ పర్చేజ్ అడిషనల్ జీఎం కమలాకర్ భూషణ్‌ను డైరెక్టర్(ఈఅండ్‌ఎం) కార్యాలయానికి, కార్పొరేట్ పీపీ అండ్ పీ అడిషనల్ జీఎం ఎంజీ ప్రసాద్‌ను కార్పొరేట్ స్టోర్స్ జీఎం కార్యాలయానికి, కొత్తగూడెం ఏరియా ఇంజినీర్ వై.రఘురామిరెడ్డిని అండర్ గ్రౌండ్ మైన్స్ జీఎం కార్యాలయానికి, కార్పొరేట్ స్టోర్స్ ఏజీఎం జేసురత్నంను కార్పొరేట్ (ఈఅండ్‌ఎం) జీఎం కార్యాలయానికి, మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ ఏజీఎం సీహెచ్.నవీన్‌కుమార్‌ను కార్పొరేట్ జీఎం కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

గోదావరి కాలుష్యంపై కోర్టులో పిల్

గోదావరిఖనిటౌన్: గోదావరి నది కాలుష్యంపై స్థానిక సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, న్యాయవాది ఎంచర్ల మహేష్ గోదావరిఖని అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టులో వారం క్రితం పిల్ దాఖలు చేశారు. దీనికి ప్రతివాదులుగా కలెక్టర్, రామగుండం కార్పొరేషన్ కమిషనర్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డును చేరుస్తూ ఆగస్టు 5న నేరుగాగానీ, న్యాయవాదుల ద్వారాగానీ కోర్టుకు హాజరు కావాలని అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

రాజన్న ఆలయంలో విజిలెన్స్ దాడులు

- బెంబేలెత్తిన అధికారులు
- సిబ్బందిలో అయోమయం



ఈవో కృష్ణప్రసాద్‌తో చర్చిస్తున్న విజిలెన్స్ అధికారులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో మంగళవారం విజిలెన్స్ దాడులు జరిగాయి. సీఐలు అనిల్‌కుమార్, వరుణ్‌ప్రసాద్, తహసీల్దారు దినేశ్ రెడ్డి, ఏఈ శశిధర్, ఇద్దరు కానిస్టేబుళ్ల బృందం ఆలయానికి చేరుకుంది. ముందుగా ప్రసాదాల తయారీ గోదాం, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, ఆలయంలోని విభాగాలను తనిఖీ చేసి రికార్డులు స్వాధీనపరచుకున్నారు. అనంతరం ఈవో చాంబర్‌కు చేరుకుని రికార్డులు పరిశీలించారు. ప్రసాదాల తయారీకి వాడే కాజు, కిస్మిస్, చక్కెర మిశ్రమాల తీరు, గోదాంలోని స్టాక్, ప్రసాదాల కౌంటర్‌లోని స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలో అధికారుల సీనియారిటీ జాబితా, ఉద్యోగుల ప్రమోషన్‌లో తీసుకున్న చొరవ, గతంలో విజిలెన్స్ కేసుల్లో ఉన్నవారి వివరాలు, వారు చేస్తున్న డ్యూటీపై విచారణ చేపట్టారు. కాగా విజిలెన్స్ అధికారుల తనిఖీలతో అధికారులు, సిబ్బంది అయోమయానికి గురయ్యారు. ఎక్కడివారక్కడే తమతమ విభాగాల్లో పనులు చేసుకుంటూ కనిపించారు. ఈవిషయంపై విజిలెన్స్ అధికారులను విలేకరులు ప్రశ్నించగా, తమకు అందిన ఫిర్యాదుల మేరకు ఆలయంలో తనిఖీలు నిర్వహించి, రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగొద్దు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్లు



వీసీలో పాల్గొన్న జీఎం శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూడాలని సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్, కోల్‌మూమెంట్ ఈడీ అల్విన్ సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వానల దృష్ట్యా ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ వెలికితీతకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. వినియోగదారులకు ఒప్పందం మేరకు బొగ్గు సరఫరా చేయాలని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు డిమాండ్, వినియోగం దృష్ట్యా సింగరేణి సంస్థపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. సమావేశంలో మార్కెటింగ్ జీఎం సూర్యనారాయణ, సీపీపీ జీఎం రమేశ్, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, గ్రూప్ ఏజెంట్ బానోతు సైదులు, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ అనిల్‌గబాలే, సీహెచ్‌పీ ఈఈ దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాల సాధనలో ముందుండాలి

నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందుండాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఏరియా ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఓవర్ బర్డెన్ తరలింపు, సేఫ్టీ, సివిల్, పర్సనల్‌కు సంబంధించిన అంశాలపై అధికారులతో మాట్లాడారు. భూగర్భ గనుల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై చర్చించారు. జీడీకే ఓసీపీ–5 నుంచి బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తరలింపు ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు. ఎస్వోటూ జీఎం రామ్మోహన్, ఏజెంట్ బానోతు సైదులు, చిలక శ్రీనివాస్, జీడీకే ఓసీపీ–5 ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, పర్సనల్ డీజీఎం లక్ష్మీనారాయణ, డీజీఎం సివిల్ నవీన్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సర్వే అధికారి ప్రభాకర్, ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, ఎన్వీ రావు, మేనేజర్లు అనిల్‌గబాలే, రమేశ్ కుమార్, నెహ్రూ, తిరుపతి, ఎస్ఈ దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సంచిక ఆవిష్కరణ

గోదావరిఖనిటౌన్: జీపీపీపీజీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ–మన రక్షణ అనే వార్షిక సంచికను సింగరేణి ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆవిష్కరించారు. మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎల్.రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఎరుకల నాగరాజు, ఆర్ఎఫ్‌సీఎల్ ఏజీఎం సత్యనారాయణ, కేశోరాం సిమెంట్ ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ సతీశ్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ మధుకర్, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో మంగళవారం గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్టీపీసీ యాజమాన్యంతో గతంలో జరిగిన ఒప్పందంలోని పలు అంశాలను అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికచట్టాలు వారికి చుట్టాలుగా మారాయా..? అని ప్రశ్నించారు. కార్మిక సంఘాల నాయకులు శాంతియుతంగా నిరసనలు చేస్తున్నా.. యాజమాన్యం స్పందించకపోవడమేంటని ప్రశ్నించారు. ఆగస్టు ఒకటో తేదీలోపు కార్మికులకు అనుకూలంగా ఒప్పందం జరగకుంటే నిరసనలకు దిగుతామని, దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్మిక సంఘం నాయకులు ఇజ్జగిరి భూమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు సీహెచ్.ఉపేందర్, బుర్ర శంకర్ గౌడ్, వీరాలాల్, కార్మిక సంఘం నాయకులు ఎం.శంకర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కార్మిక వాడల్లో డ్రైనేజీలు శుభ్రం చేయండి

- టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్



కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ: వర్షాకాలం దృష్ట్యా ఆర్జీ–2 ఏరియా సింగరేణి సివిల్ విభాగం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ కార్మిక వాడల్లో పర్యటించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కార్మికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్మిక వాడల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, చాలా ఏళ్లు గడిచిందన్నారు. ముఖ్యంగా కొన్ని ఏరియాల్లో డ్రైనేజీ కుండీల మీద మూతలు లేకపోవడంతో మురుగునీరు కార్మికులు నివాసం ఉండే క్వార్టర్స్‌లోకి వస్తోందని పేర్కొన్నారు. వెంటనే డ్రైనేజీ కుండీలపై మూతలు ఏర్పాటు చేసి, చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని సిబ్బందికి సూచించారు. సివిల్ విభాగంలో మ్యాన్ పవర్ పెంచడంతోపాటు ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీర్ పర్వతగిరి రాజు, సూపర్ వైజర్ రామ్ కోటి, నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా పోటీలకు సింగరేణి క్రీడాకారులు



నాగ్‌పూర్‌లో క్రీడాకారులు

గోదావరిఖని: నాగ్‌పూర్‌లో వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్ క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు సింగరేణి నుంచి క్రీడాకారులు తరలివెళ్లారు. ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే పోటీల్లో టీం మేనేజర్‌తోపాటు 8 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. టీం మేనేజర్ వేణుగోపాల్, కెప్టెన్ బీహెచ్ఎస్ శర్మ, ఎంవీ రావు, కేశచారి, పి.వెంకటేశ్వర్లు, కె.శ్రీధర్, ఎంవీ రమణారావు, ఎస్.సేత్, సీహెచ్.శ్రీనివాస్ సంస్థ తరఫున హాజరవుతున్నారు. వీరు డబుల్స్, సింగిల్స్, వెటరన్, మెన్ విభాగాల్లో తలపడనున్నారు.

ఏసీపీని కలిసిన ఆర్జీ–1 జీఎం



ఏసీపీ శ్రీనివాసరావుకు మొక్క అందిస్తున్న జీఎం

గోదావరిఖని: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ తులా శ్రీనివాసరావును సింగరేణి ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ మంగళవారం ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్క అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి విలువైన ఆస్తులను కాపాడటంలో పోలీసుల సహకారం అందించాలని కోరారు. జీఎం వెంట సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఎస్వోటూ జీఎం రామ్మోహన్ ఉన్నారు.

ఏఎల్‌పీకి నిలిచిన వాహనాల రాకపోకలు

- స్టీల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వాగు



డ్యూటీ ముగించుకొని కాలినడకన వంతెన పైనుంచి వస్తున్న కార్మికులు

కమాన్‌పూర్: ఆర్జీ–3 పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు(ఏఎల్‌పీ)కు వెళ్లే దారిలోని బొక్కల వాగు స్టీల్ వంతెన పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో అధికారులు, కార్మికులు మంగళవారం విధులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. వాహనాలను వాగు ఒడ్డున నిలిపి, వంతెన పైనుంచి కాలినడకన వెళ్లారు. ఏటా వానాకాలంలో బొక్కల వాగు ప్రవహిస్తే నానాతంటాలు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం ఇటీవలే శంకుస్థాపన చేశారు.

భూసేకరణ పనులు పూర్తి చేయాలి

- కార్పొరేట్ ఎస్టేట్ జీఎం రవిప్రసాద్



మాట్లాడుతున్న ఎస్టేట్ జీఎం రవిప్రసాద్

గోదావరిఖని: భూసేకరణ పనులు పనులు పూర్తి చేయాలని కార్పొరేట్ ఎస్టేట్ జీఎం రవిప్రసాద్ అన్నారు. మంగళవారం ఆర్జీ–2 జీఎం మనోహర్‌ను కలిసి ఏరియాలో సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించారు. ఓసీపీ–3 విస్తరణలో భాగంగా పెద్దంపేట్‌లో భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, గ్రామానికి సంబంధించిన ఇతర సమస్యలను తెలుసుకున్నారు. భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్టేట్స్ విభాగం అధికారులకు సూచించారు. సమావేశంలో సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత, ఎస్టేట్స్ అధికారి సురేష్‌బాబు పాల్గొన్నారు.